## క్లుప్తంగా

### రేషన్ బియ్యం పట్టివేత

రేపల్లె రూరల్: అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు మండలంలోని మైనేనివారిపాలెం గ్రామానికి చెందిన బొలిశెట్టి తరుమలరావు కిరాణా దుకాణంలో ఆదివారం రాత్రి తనిఖీలు నిర్వహించగా 12.5 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించామన్నారు. వీటిపై సివిల్ సప్లయిస్ అధికారులకు సమాచారం అందించగా..వారు పరిశీలించి రేషన్ బియ్యంగా నిర్ధారించారన్నారు. తిరుమలరావు గ్రామంలో ఇంటింటికి తిరిగి రేషన్ బియ్యంను సేకరించి అక్రమంగా విక్రయాలకు పాల్పడుతున్నట్లు విచారణలో తేలిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

### సామూహిక లక్ష బిల్వార్చన



పెదలంక(భట్టిప్రోలు): సత్యసాయిబాబా సేవా సమితి బాల వికాస్ ఆధ్వర్యంలో పెదలంక గ్రామంలో కొలువైన శ్రీ గంగా పార్వతి సమేత శ్రీ పృథ్వీశ్వర స్వామి దేవాలయంలో సోమవారం సామూహిక లక్ష బిల్వార్చన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్వాతి హైస్కూల్‌కి చెందిన బాలబాలికలు, భక్తులు పాల్గొన్నారు.

### నేరం అంగీకరించాలని ఒత్తిడి తెస్తున్నారు

భట్టిప్రోలు: సంబంధం లేని కేసులో తమను ఇరికించి, నేరం అంగీకరించాలని భట్టిప్రోలు ఎస్ఐ ఎం.శివయ్య ఒత్తిడి తెస్తున్నారని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా కార్యదర్శి పీజీ అరుణ్ శాస్త్రి, మండల కార్యదర్శి మోర్ల కోటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు గోలి శ్రీనివాసరావులు సోమవారం బాపట్ల ఎస్పీ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు సాయిబాబా తమపై చేసిన దాడిలో గాయాల పాలై కేసు నమోదు చేయగా సాయిబాబా కూడా ఇచ్చిన కౌంటర్ కేసును కూడా నమోదు చేయడం జరిగిందని తెలిపారు. 14 నెలల అనంతరం కేసు విచారణకు నోటీసులు ఇచ్చే నెపంతో పోలీస్ స్టేషన్‌కు పిలిపించి సాయిబాబాకు చెందిన సెల్‌ఫోన్, నగదును అపహరించినట్లుగా నమోదైనందున అంగీకరించమని ఒత్తిడి తెస్తున్నారని పేర్కొన్నారు. అధికార పార్టీకి వత్తాసుగా వ్యవహరిస్తున్న పోలీసులపై విచారణ నిర్వహించి తమకు రక్షణ కల్పించాలని కోరినట్లు వివరించారు.

### సోమేశ్వరస్వామి దేవాలయం నిర్మించాలి



బాపట్ల: బాపట్ల పట్టణం గంగా పార్వతీ సమేత సోమేశ్వర స్వామి దేవాలయం పునర్నిర్మానం చేపట్టాలని విశ్వహిందూ పరిషత్ సభ్యులు నిరసన తెలిపారు. గత ప్రభుత్వం దేవాలయం నిర్మాణానికి పూనుకోగా కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవటం బాధకరమన్నారు. దేవాలయం నిర్మాణం చేపట్టాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్, అర్చకులు బాబీస్వామి, విశ్వహిందూపరిషత్ నుంచి చీమలదిన్నె శివయ్య, ధూళిపాళ్ల శీను, బండ్రెడ్డి రజిని తదితరులున్నారు.

### రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు విద్యార్థుల ఎంపిక

తెనాలి: రాష్ట్ర స్థాయి అండర్-19 ఫెన్సింగ్ పోటీలకు 9వ తరగతి చదువుతున్న పెనుమూల బ్యూల, హాకీ పోటీలకు షేక్ హనీఫ్ (9వ తరగతి), షేక్ రియాజ్(8 వ తరగతి) ఎంపికైనట్లు స్థానిక కొత్తపేటలోని రావి సాంబయ్య మున్సిపల్ హైస్కూలు ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు చిలకా సుందరరావు తెలిపారు. జిల్లాపరిషత్ హైస్కూలు, నందిగం, సత్తెనపల్లిలో సోమవారం జరిగిన స్కూల్‌గేమ్స్‌లో పాల్గొన్న తమ విద్యార్థులు సత్తా చాటినట్లు చెప్పారు. ఫెన్సింగ్ రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలు కర్నూలులోనూ, హాకీ రాష్ట్రస్థాయి పోటీలు కాకినాడలో జరుగుతాయని వివరించారు. విద్యార్థులను పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు టి.ప్రసాదకుమారి, కొడాలి గోవర్ధన అభినందించారు.

### మురుగు ప్రతి రోజూ తొలగించండి

తెనాలిఅర్బన్: పట్టణంలోని మురుగు కాల్వలలోని మురుగును ప్రతి రోజు తొలగించాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వి.ఎం.లక్ష్మీపతి ఆదేశించారు. పట్టణంలోని 2,16,17 వార్డుల్లో సోమవారం ఆయన పర్యటించారు. వార్డులో జరుగుతున్న కాలువల పూడికతీత పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ మురుగు కాల్వల్లో ప్రణాళికబద్ధంగా పూడికతీత పనులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మురుగు కాల్వలపై ఏమైనా సమస్యలు ఉంటే తమకు తెలియజేయాలన్నారు.

# అర్ధంతరంగా..నిరుపయోగంగా

- గ్రామ స్వరాజ్య సాధనకు సచివాలయ వ్యవస్థ ప్రారంభం
- కూటమి ప్రభుత్వం రాకతో లక్ష్యం నిర్వీర్యం
- అర్ధంతరంగా నిలిచిపోయిన భవన నిర్మాణాలు
- బిల్లులు నిలిపివేసిన సర్కార్..
- అసంపూర్తిగా, నిరుపయోగంగా భవనాలు



కుచ్చెళ్లపాడు గ్రామంలో నిలిచి పోయిన గ్రామ సచివాలయం భవనం



వరహాపురం గ్రామంలో నిలిచి పోయిన గ్రామ సచివాలయం భవనం

వేమూరు: కూటమి ప్రభుత్వం గ్రామ సచివాలయం నిర్మాణాలను పూర్తి విస్మరించింది. గ్రామ స్వరాజ్యంలో భాగంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. సచివాలయ భవనాల నిర్మాణానికి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా నిధులు కేటాయించింది. కొన్ని గ్రామ సచివాలయాల భవనాల నిర్మాణం పూర్తి చేశారు. మరి కొన్ని గ్రామాల్లో నిలిచిపోయిన నిర్మాణాలు వెంటనే పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. దీంతో ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయాలని కోరుతున్నారు. వేమూరు నియోజకవర్గంలో 71 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. వేమూరు మండలంలో 14 గ్రామ సచివాలయాలకు నాలుగు భవనాలు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. కొల్లూరు మండలంలోని 16 గ్రామ సచివాలయాలకు పదింటికి భవనాలు నిర్మించారు. 6 గ్రామ సచివాలయాల భవనాలు వివిధ దశల్లో ఉన్నాయి. అమర్తలూరు మండలంలోని 14 గ్రామ సచివాలయాల భవనాలు పూర్తి చేశారు. చుండూరు మండలంలోని 15 గ్రామ సచివాలయాలుకు 12 భవనాలు నిర్మించారు. 3 గ్రామ సచివాలయాలు వివిధ దశల్లో ఉన్నాయి. భట్టిప్రోలు మండలంలో 11 గ్రామ సచివాలయాలకు 3 భవనాలు పూర్తి చేశారు. 3 భవనాలు వివిధ దశలో ఉన్నాయి. 5 భవనాలు పనులు ప్రారంభంచలేదు. ఈ భవనాలు పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**నిధులున్నా..నిర్లక్ష్యం**

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు ఉన్నాయి. గ్రామ సచివాలయాలు భవనాలు నిర్మాణం పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. భవనాలు నిర్మాణం పనులు చేసిన వ్యక్తులకు బిల్లులు చేయకుండా ఇబ్బందులు పెడుతున్నారు. దీంతో భవనాల నిర్మాణాలు పూర్తిగా నిలిచిపోయాయి. అధికారులు చొరవ తీసుకొని భవనాలు నిర్మాణాలు చేసిన వ్యక్తులకు బిల్లులు చెల్లించి, గ్రామ సచివాలయాలు భవనాలు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

**తప్పని ఇక్కట్లు**



గ్రామ పంచాయతీ కార్యాలయం శిథిలావస్థకు చేరింది. గత ప్రభుత్వం గ్రామ సచివాలయం మంజూరు చేసింది. భవన నిర్మాణం పూర్తి కాక పోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం గ్రామ సచివాలయ భవన నిర్మాణం పూర్తి చేయాలి.

– తాడి కొండ శ్రీనుబాబు, కుచ్చెళ్లపాడు, వేమూరు

**బిల్లులు చెల్లించాలి**



ప్రభుత్వం భవన నిర్మాణదారులకు బిల్లులు నిలిపివేసింది. దీంతో భవన నిర్మాణాలు పూర్తిగా నిలిచిపోయాయి. అసంపూర్తిగా ఉన్న భవనాలు నిరుపయోగంగా మారాయి. ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తే..బాగుంటుంది.

– యల్లమాటి మోహనరావు, వరహాపురం

### ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఐదు అర్జీలు



రేపల్లె రూరల్: ప్రజలు తమ సమస్యలను ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీల రూపంలో అందజేసి పరిష్కరించుకోవాలని ఆర్డీవో నేలపు రామలక్ష్మి అన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం ఆమె ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి అనంతరం మాట్లాడారు. రేపల్లె ప్రభుత్వ వైద్యశాలలో ఆక్సిజన్ ప్లాంట్‌కు మరమ్మతులు నిర్వహించి వాడుకలోకి తీసుకురావాలని పట్టణాభివృద్ధి సంఘ కార్యదర్శి సీవీ మోహనరావు అర్జీ అందించారన్నారు. ఆక్రమణల సమస్యపై 1, సర్వే లిస్ట్‌లో తమ భూమి సర్వే నంబరును తొలగించాలని ఒక అర్జీ అందిందన్నారు. ఆన్‌లైన్‌లో ఒక అర్జీ అందగా, ఇతర సమస్యలపై మరో అర్జీ అందిందని, ఐదు అర్జీలను పరిశీలించి సమస్యలను ఆయా శాఖల అధికారులు పరిష్కరిస్తారని చెప్పారు.

### పౌష్టికాహారం దోహదం

తెనాలిఅర్బన్: క్షయ వ్యాధి నివారణకు పౌష్టికాహారం దోహదపడుతుందని తెనాలి టీబీ యూనిట్ అధికారి డాక్టర్ రాధిక పేర్కొన్నారు. నందులపేటలోని అర్బన్‌హెల్త్ సెంటర్‌లో సోమవారం క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు.

## నాగేంద్రస్వామికి వార్షికోత్సవ పూజలు

కర్లపాలెం: మండలంలోని నల్లమోతువారిపాలెం జాతీయ రహదారి పక్కనే ఉన్న నాగేంద్రస్వామి అలయ 8వ వార్షికోత్సవ పూజలు సోమవారం ఘనంగా జరిగాయి. వైఎస్సార్ సీపీ బాపట్ల సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి పాల్గొని నాగేంద్రస్వామికి, జంట నాగులకు పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో జరిగిన అన్నదాన కార్యక్రమంలో అయన పాల్గొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఆలయం వద్ద అన్నదానం చేశారు. పార్టీ మండలాధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆట్ల నాగేశ్వరరెడ్డి, నాయకులు గరిగంటి కిరణ్, దుర్గా ప్రసాద్, గోపి, వీర్లంకయ్య, రవీంద్ర, పాండురంగారావు, సాయి ఉన్నారు.

**పుట్టవద్ద కోన ప్రత్యేక పూజలు**

బాపట్ల: మండలంలోని నాగేంద్రపురంలోని పుట్ట వద్ద మాజీ డెప్యూటీ స్పీకర్ కోన రఘుపతి సోమవారం ప్రత్యేక పూజలు చేపట్టారు. పుట్టవద్ద పాలు పోసి పూజలు చేపట్టారు.కార్తీక మాసంలో శైవక్షేత్రాల్లో ప్రత్యేక పూజలకు అనుగుణంగా దేవాలయాలు అభివృద్ధి చేయాలని కోన సూచించారు. కోనతోపాటు వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షులు కోకి రాఘవరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



జంట నాగుల విగ్రహాలకు మాజీ ఎమ్మెల్యే కోన పూజలు

## ఎమ్మెల్సీ ఓటర్ల దరఖాస్తుల సమస్యలు పరిష్కరించాలి

**సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్**

రేపల్లె రూరల్: గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఓట్ల చేర్పుల్లో వస్తున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో నాయకులు సోమవారం ఆర్డీవో రామలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు మణిలాల్ మాట్లాడుతూ ఓటు హక్కు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులను రేపల్లె పట్టణంలోని బీఎల్వోలు తనిఖీలకు సచివాలయాలకు రమ్మని బలవంతం పెడుతున్నారన్నారు. నిబంధనల ప్రకారం అర్జీల తనిఖీలకుకై బీఎల్వోలు ఇంటింటికి పర్యటించాల్సి ఉండగా అభ్యర్థులను కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నారన్నారు. నిబంధనలకు సంబంధం లేని 10వ తరగతి, ఇంటర్ సర్టిఫికెట్‌లు కూడా గెజిటెడ్ సంతకాలు కావాలని ఓటు నమోదు చేసుకున్న వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. నిజాంపట్నం మండలంలో పలువురు ఓటర్లు గెజిటెడ్ అధికారుల సంతకాలతో సర్టిఫికెట్‌లు సమర్పించినా తనిఖీల్లో బీఎల్వోలు చెల్లవంటూ రద్దు చేస్తున్నారన్నారు. విద్యార్హత సర్టిఫికెట్‌లలో మండలస్థాయి, కాలేజీ అధ్యాపకుల వంటి వారి సంతకాలే కావాలని ఓటర్లను తిప్పించుకోవటం సరైన విధానం కాదన్నారు. నవంబర్ 6వ తేదీ వరకే దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉన్నందన అందిన దరఖాస్తులపై విచారించి ఓటర్లును ఇబ్బందులకు గురిచేయకుండా సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఆశీర్వాదం, ఎల్.గోపి, కే.గోపి పాల్గొన్నారు.



ఆర్డీఓ రామలక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

## ప్రతి ఒక్కరూ ఆధార్ కలిగి ఉండాలి

రేపల్లె రూరల్: ప్రతి ఒక్కరూ ఆధార్ కార్డును విధిగా కలిగి ఉండాలని తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని చోడాయపాలెంలో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాన్ని సోమవారం ఆయన పరిశీలించి, మాట్లాడారు. వడ్డీవారిపాలెం, బొబ్బర్లంక, కైతేపల్లి, పిరాట్లంక, విశ్వేశ్వరం గ్రామాల్లోని ఎస్టీ కాలనీలలో కొంత మందికి ఆధార్ గుర్తింపు కార్డులు లేవని గ్రహించామన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక క్యాంప్‌ల ద్వారా ఆధార్ నమోదు కార్యక్రమం చేపడుతున్నామన్నారు. కాల్వగట్టులు, పోరంబోకు భూములలో గుడిసెలు వేసుకుని జీవించే మత్స్యకార యానాదులకు సైతం ఆధార్‌కార్డు అందించేలా కార్యక్రమాలు చేపట్టామని వివరించారు. ఈ అవకాశాన్ని ఆధార్‌లేని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయన వెంట ఆర్ఐ రాంబాబు, రెవిన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



ఆధార్ నమోదును పర్యవేక్షిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

## అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి




శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ లలిత కుమారి

భట్టిప్రోలు: నిరక్షరాసులైన మహిళలను గుర్తించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి పేర్కొన్నారు. మండలంలో గుర్తించిన 56 మంది ఉల్లాస్ విద్యా వలంటీర్లకు భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఎంపీడీవో ఎస్.వెంకట రమణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీపీ లలిత కుమారి మాట్లాడుతూ కేరళ రాష్ట్రాన్ని ఆదర్శంగా తీసుకుని అక్షరాస్యత సాధనలో ముందుకు తీసుకువెళ్లాలని కోరారు. నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్ది వచ్చే ఏడాది కల్లా వ్రాత పరీక్ష వ్రాసే విధంగా తీర్చిదిద్దాలని వలంటీర్లను కోరారు. ఎంపీడీవో వెంకట రమణ మాట్లాడుతూ మండలంలో 560 మంది నిరాక్షరాసులను గుర్తించి 56 మంది వలంటీర్ల ద్వారా ఇప్పటి నుంచి మార్చి 5 వ తేదీ వరకు సాయంత్రం 5 నుంచి రాత్రి 7 గంటల వరకు విద్యా బోధన చేస్తారని చెప్పారు. జెడ్పీటీసీ సభ్యురాలు టి. ఉదయభాస్కరి, తహసీల్దార్ మేకా శ్రీనివాసరావు, వయోజన విద్య సూపర్‌వైజర్ సీహెచ్ శివరామ ప్రసాద్, ఈవోపీఆర్డీ టి.ఉషారాణి, ఏరియా కో-ఆర్డినేటర్ రమాదేవి, ఎపీఎం జి.శ్రీమన్నారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఫజురున్నీస్సా, ఎంఈవో నీలం దేవరాజు, మండల సమాఖ్య అధ్యక్షురాలు జాలాది ధనలక్ష్మి, సీసీలు, ఎంఎస్‌ఎలు పాల్గొన్నారు.

## భక్తులతో కిక్కిరిసిన శైవక్షేత్రాలు

- తెల్లవారుజామునే తీరంలో పుణ్యస్నానాలాచరించిన భక్తులు
- సామూహిక పూజలు నిర్వహించిన మహిళలు



రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక అలంకరణ



పూజలు చేస్తున్న భక్తులు



సూరేపల్లిలో వాయు లింగానికి పూజలు



వెల్లటూరు కట్లమ్మ తల్లి దేవాలయంలో పీఠం



ఇసుకపల్లిలో చెన్నమల్లేశ్వరస్వామి



రామలింగేశ్వర స్వామి ఆలయంలో పూజలు

బాపట్ల: కార్తీక మాసం తొలి సోమవారం భక్తులు శైవక్షేత్రాలకు పోటెత్తారు. ముఖ్యంగా మహిళలు తెల్లవారుజామునే సూర్యలంక తీరానికి చేరుకొని తీరంలో పుణ్య స్నానాలు చేసి తీరం ఒడ్డున పసుపు, కుంకుమ, ఐదు రకాల పూలు, పండ్లతో గౌరిదేవి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ కార్తీకమాసం ప్రారంభం అయినప్పటి నుంచి ముగిసేంతవరకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని చెబుతున్నారు.

**భక్తులతో పోటెత్తిన శివాలయాలు..**

పట్టణంలోని అగ్రహారంలో వేంచేసియున్న శ్రీగంగా పర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి దేవాలయంలో, సోమేశ్వరస్వామి ఆలయానికి భక్తులు సోమవారం తెల్లవారుజామున పోటెత్తారు. పుణ్య స్నానాలనంతరం అధిక సంఖ్యలో మహిళలు సోమేశ్వరస్వామి ఆలయానికి చేరుకొని స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. తెల్లవారుజామున నాలుగు నుంచి ఆరు గంటల వరకు స్వామివారికి విశేషపూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయానికి భారీ సంఖ్యలో చేరుకున్న మహిళలు ఆలయ ప్రాంగణంలో సామూహిక కుంకుమార్చన, గౌరిదేవి పూజలు, పుష్పార్చన కార్యక్రమాలను కన్నుల పండుగగా నిర్వహించారు. మహిళలంతా ఒక్క సారిగా ఆలయానికి తరలిరావడంతో సోమేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిక్కిరిసింది. త్యాగరాయనగర్‌లోని శ్రీ రమా సహిత సత్యనారాయణస్మామి, మండలంలోని వెదుళ్ళపల్లిలో గంగా పార్వతి సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి, అప్పికట్లలోని అన్నపూర్ణ సహిత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు.

**భారీగా దీక్షలు తీసుకున్న భక్తులు**

కార్తీకసోమవారం కావటంతో భారీగా అయ్యప్ప స్వామి, శివ దీక్షపరులు దీక్షలు చేపట్టారు. అయ్యప్పస్వామి దేవాలయంలో రామాకాంత్‌గురుస్వామి, అగ్రహారం శివాలయంలో ప్రసాద్‌గురుస్వామి దీక్షాపరులకు మాలధారణ కార్యక్రమాన్ని నిర్వహించి నియమాలను వివరించారు.

**ఆలయాల్లో కార్తిక సోమవారం శోభ**

భట్టిప్రోలు: కార్తిక మాసం మొదటి సోమవారం పురస్కరించుకుని మండలంలోని అన్ని గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో కోలాహలంగా మారాయి. స్వామి వారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు చేశారు. సూరేపల్లిలో కేదారేశ్వర వాయులింగ దేవస్థానంలో స్వామి వారికి భక్తులు స్వయంగా అభిషేకాలు చేశారు. కార్తీక మాసం పురస్కరించుకుని ఈ నెల రోజుల పాటు నిర్వాహకులు అయ్యప్ప, శివ స్వాములకు సద్ది ఏర్పాట్లు నిర్వహిస్తున్నారు. పెదపులివర్రులో కొలువైన బాలాత్రిపురసుందరి దేవి సమేత రాజరాజ నరేంద్రస్వామి దేవాలయంలో తెల్లవారుజామున స్వామి వారికి ఏకాదశ రుద్రాభిషేకం, భస్మాభిషేకం నిర్వహించారు. కల్యాణంలో జి.మల్లిఖార్జునరావు, ఎన్. బాబు రాజశేఖర్ దంపతులు పాల్గొన్నారు. పూజా కార్యక్రమాలను ఆమంచి సృజన్ కుమార్‌లు నిర్వహించగా కార్యక్రమాన్ని ఈవో మేకా సాంబశివరావు పర్యవేక్షించారు. పూజా కార్యక్రమాల్లో పలువురు దంపతులు పాల్గొన్నారు.

**వైభవంగా కార్తిక ప్రత్యేక పూజలు**

రేపల్లె రూరల్: పవిత్ర కార్తిక మాసాన్ని పురస్కరించుకుని పట్టణ, మండలంలోని పలు దేవాలయాల్లో సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శివకేశవులకు ప్రీతిపాతం కావటంతో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలోని స్వయం భూరామలింగేశ్వరస్వామి ఆలయం, ఇసుకపల్లిలోని భ్రమరాంబ సమేత చెన్నమల్లేశ్వర స్వామి ఆలయం, ఓల్డ్‌టౌన్‌లోని బాలాత్రిపుర సుందరీ సమేత ఉమామహేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు ఉదయం నుంచే కార్తిక దీపాలను వెలిగించి భక్తిని చాటుకున్నారు. అదేవిధంగా మోర్తోట గ్రామంలో ముక్తేశ్వరస్వామి ఆలయంలోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**కార్తిక మాసం పూజలు**

చుండూరు(వేమూరు): చుండూరు మండలంలోని చినపరిమి గ్రామంలోని శ్రీ రామలింగశ్వర స్వామి దేవస్థానంలో కార్తిక సోమవారం పూజలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### కళాదర్శకుడు రత్నాకర్‌కు సత్కారం

తెనాలి: 'ప్రాచీనభారత్' పేరుతో జాతీయ చిత్రకళా ఉత్సవం-2024 ఒంగోలు అంబేద్కర్ భవనంలో ఆదివారం నిర్వహించారు. కళాయజ్ఞ, నెస్ట్ మేకర్స్, సృష్టి ఆర్ట్ అకాడమి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవంలో చిత్రకళా రంగంలో సేవలందిస్తున్న ప్రముఖులను ఆహ్వానించి సత్కరించారు. తెనాలి పట్టణానికి చెందిన వరల్డ్ రికార్డు హోల్డర్, సినీ ఆర్ట్ డైరెక్టర్ కనపర్తి రత్నాకర్ కూడా ఈ గౌరవాన్ని అందుకున్నారు. ఆయా సంస్థల నిర్వాహకులు వై.శేషబ్రహ్మం, కె. భూపాల్ రెడ్డి, తిమ్మిరి రవీంద్ర సత్కరించారు.

## సేంద్రియ ఉత్పత్తులతో ఆరోగ్యం

పిట్టలవానిపాలెం(కర్లపాలెం): సేంద్రియ ఆహార ఉత్పత్తులతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ప్రకృతి వ్యవసాయం పిట్టలవానిపాలెం మండల కో-ఆర్డినేటర్లు సుధాదేవి, ప్రవల్లిక, సౌజన్య తెలిపారు. మహిళా రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో పండించిన కూరగాయలు, ఆకుకూరలను సోమవారం మండల పరిషత్ కారాలయం వద్ద విక్రయానికి ఉంచారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం కో-ఆర్డినేటర్లు మాట్లాడుతూ రైతులు సాగుచేసే వరి, వేరుశనగ, మినుముతో పాటు కూరగాయల పంటలు కూడా ప్రకృతి వ్యవసాయం ఉత్పత్తులను వినియోగించి పండించాలని చెప్పారు. ప్రకృతి సేద్యం ద్వారా పండించిన ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మహిళా రైతులతో పాటు ఐసీఆర్పీలు కూడా పాల్గొన్నారు.



కూరగాయలు విక్రయిస్తున్న మహిళా రైతులు

## పాఠశాల విద్యార్థులకు వనరుల పంపిణీ



తెనాలి: పట్టణానికి చెందిన వేజళ్ల వెంకట సుబ్బారావు 90వ జయంతిని సోమవారం స్థానిక మారీసుపేట మఠంబజారులోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించారు. వేజళ్ల వెంకట సుబ్బారావు స్మారక ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటైన కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుగ్రహీత వేజళ్ల ఉమామహేశ్వర్, పాఠశాలలోని 60 మంది విద్యార్థులకు బాలసాహిత్యం, నీతికథల పుస్తకాలు, నోట్‌పుస్తకాలు, మొక్కలు, గుడ్డ సంచులు, పెన్నులు, రంగు పెన్సిళ్లు, బిస్కట్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. బాలసాహిత్యం చదవాల్సిన ఆవశ్యకతపై ప్రముఖ బాలసాహితీవేత్త షేక్ అబ్దుల్ హకీంజాని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇదే వేదికపై అబ్దుల్ హకీంజానిని 'బాలసాహిత్య రత్న' పురస్కారంతో ఉమామహేశ్వర్ సత్కరించారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు గణేష్, పుల్లారావు, సీఆర్‌పీ శ్రీదేవిని కూడా సన్మానించారు. ట్రస్ట్ సభ్యులు టీఎస్‌పీ ప్రసాద్, బి.శివరామకృష్ణ పాల్గొన్నారు.